# గుడ్ బై

రాయప్రోలు హైమ



రేడియోలో వాతావరణ సూచనలేవీ వినిపించకుండానే ఆకాశంలో అప్పటికప్పుడు ప్రోగుపడి ఏబాటువాన కురిపిస్తున్న మబ్బుల్లాగ వర్షిస్తున్నాయి కుమారి స్వతంత్ర భారతి కళ్ళు. ముడతలు పడుతున్న ఆమె చెంపలమీద కారుతున్న కన్నీళ్ళు బండరాతిమీద చారలుకట్టి జారుతున్న కొండవాగు ప్రవాహం తలపిస్తున్నాయి. ఆమె కళ్ళు మాత్రం కన్నీటి తెరలని లక్ష్యపెట్టకుండా ఉత్తరం చదువుతున్నాయి. విషయం మస్తిష్కానికి చేరవేస్తూనే ఉన్నాయి. ఆమె కాళ్ళు గడగడ వణికిపోతున్నాయి. గుండె మూలుగుతోంది. చేతులు పట్టుజారిపోతున్నాయి. అయినా నిలదొక్కుకుని ఉత్తరం పూర్తిగా చదివింది. రెండోసారి మళ్ళీ చదివింది. మూడోసారి అక్కడక్కడ ముఖ్యమయిన విషయాలున్న పేరాలు ఎంచి చదివింది. ఎన్నిసార్లు చదివినా, ఏ విధంగా చదివినా ఒకటే సంగతి. తను మరొక్కసారి ఒంటరి అయిపోయింది.

ఉత్తరం మడిచి హేండ్ బాగ్‌లో పడేసి, రెండు నిముషాలు గడపలో నిలబడిపోయింది. ఏదో ఆలోచించింది. చివరికేదో నిర్ణయానికి వచ్చింది. ఇందాకటి భావ సంచలనం ఆమె మొహంలోంచి మాయం అయింది. తటాక గాంభీర్యం తాండవించింది. బ్రతుకు కిటుకు అర్థం చేసుకున్న బ్రహ్మయోగిలాగ చిరునవ్వులు చిందిస్తూ లోపలికి నడిచింది.

నమ్మక్క అందించిన చన్నీళ్లతో కాళ్ళు, చేతులు, మొహం కడుక్కుంది. డ్యూటీ బట్టల్లోంచి ఇంటి బట్టల్లోకి మారింది. తిన్నగా పడక గదిలోకి వెళ్ళి మంచంమీద వాలిపోయింది. ఏమీ ఆలోచించకుండా 'సీలింగ్ ఫ్యాన్' తిరగడం గమనిస్తున్న భారతికి తన బ్రతుకొక సీలింగ్ ఫ్యాన్‌లాగ తోచింది. బయలుదేరిన చోటికే పరుగు పరుగున చేరడం.

"అట్ల ఉన్నవేమాయెనమ్మా!"

"డ్యూటీనించి రాగానే ఇంత 'చా' కలిపి తను తాగి తమ్ముని కోసం ఫ్లాస్కులో పోసి, మిగిలింది నమ్మక్క కిచ్చేసి వంటకి ఉపక్రమించే 'భారతమ్మ' ఈ దినం ఇలా డల్లుగా ఎందుకుంది!" అర్థం కాలేదు నమ్మక్కకి.

"ఏమాయెనమ్మా" మళ్ళీ పిలిచింది.

వినిపించిందో లేదో! చలనం లేదామెలో. ఎలా ఉన్న దలాగే సీలింగు ఫాన్ చూస్తూ ఉండిపోయింది. నమ్మక్క కేం పాలుపోలేదు. అలాగే గది గుమ్మంలో నిలుచుంది. నిలబడి నిలబడి ఇక చాతకాక అక్కడే కూర్చుంది.

అలా ఎంతసేపు కూర్చుందో! భారతిలో కదలిక లేదు. పోనీ నిద్రపోతోందా అంటే కళ్ళు తెరుచుకుంటున్నాయి. మూసుకుంటున్నాయి. విషయం అర్థం కాలేదు నమ్మక్కకి.

"పానం మంచిగ లేదా దొరసానీ" సాహసించి మంచం దగ్గరగా నడిచి పలకరించింది భారతిని. భారతి ప్రశ్నార్థకంగా చూసింది.

"జొరంగిట్ల వచ్చినాదమ్మ! గట్లున్నవేంది?"

తల్లి పడే ఆవేదన ధ్వనించింది నమ్మక్క గొంతులో! చటుక్కున లేచి కూర్చుంది. "నామీద ఎంత అభిమానమే నీకు" అనుకుంది. నమ్మక్కవేపు ఆప్యాయంగా చూసింది.

"వంట్లో బాగానే ఉంది నమ్మక్కా! ఎందుకో బద్ధకంగా ఉంది. కొంచెం 'చా' చేసిపెడతావూ."

కాని అటు చూడు... ఆ కుర్రాడు రోజూ అక్కడ కూర్చుని పాటలు పాడేవాడేనా...'' తన కళ్ళ మోసం చెయ్యలేదనే అనుకుంటోంది తను.

''అల్ల తంబురా వాయిస్తాడూ! అల్ల జోరుగా వుషారుగా... పాట – గంటసాలగోరిది పాడతాడూ... ఆడేనమ్మా! ఆదుగో! బిచాణా పరుచుకుం తన్నాడు...''

''వాడికి ఒక చెయ్యి లేదుగా మరి...''

''హిహిహి!...'' వెకిలిగా నవ్వేడు నాయుడు.

''ఆడికి నిజంగా చెయ్యి నేదనేసి నమ్మేస్తున్నా రేటి... దొంగవాయాలు. నిజం చెయ్యి సొక్కా నోపల బిగించేస్తడు, కర్రముక్కొకటి సవరగా చెక్కించి... జబ్బకి బిగించి... మొండిచెయ్యినాగ బయటకెట్టేసి... ఒదుక్కుంతడు. మరేటనుకుం తన్నరు... మానాగ కష్టపడే వోల్లకాడ దమ్మిడీలు పైసలు బేరమాడతరు తమరు...''

తాడుకి వేలాడుతున్న వక్కపొడి పొట్లాలు తుంచి లెక్కపెడుతూ చెప్పుకుపోతున్నాడు నాయుడు.

తనకి కంపరం ఎత్తిపోయింది.

''ఎంత మోసం! చిన్నవయసులో ఇంతలేసి మోసాలు నేర్చిన వెధవ...'' ఒళ్ళు తెలియని కోపం వచ్చింది.

''ఆడి పొట్ట కొట్నేక ఎవరికీ చెప్పంవెండి! ఆడి సంగతి ఇక్కడోల్లందరికీ తెలుసు. ఆడ్నాటి బిడ్డలు మాకూ వున్నారు కదా! అయినా... ఈడొక్కడేనేటమ్మా, సింహాచలం కొండమీద తమరిక్కనిపించే కుంటోళ్ళందరియ్యి బయట క్కనిపించే కర్రకాళ్ళ మాత్రం కుంటెయ్యి. అసలు కాళ్ళు లుంగీల్నోపట నిచ్చేవంలాగుంటాయి...''

నాయుడు చెప్పేది వింటూ ఆ కుర్రాడికేసే చూసింది తను. ఇంతలో వాడిటు చూసేడు. తనని గుర్తించేడు. కంగారుపడుతూ జోలిలోనించి 'కర్ర చెయ్యి' తీసి జబ్బకి తగిలించేడు. పక్కనే కూర్చున్న పిల్లతోటి ఏదో నవ్వుతూ మాట్లాడేడు. వాడి నవ్వు మరీ చిరాకెత్తించింది తనకి.

''సిగ్గులేక ఇంకా నవ్వుతున్నాడు వెధవ. తనెంత బాగా ప్రజల్ని మోసం చేస్తున్నదీ... ఆ కుర్రముండతో చెబుతున్నాడు కబోలు.'' కోపం పట్టలేక పెద్ద పెద్ద అంగలేస్తూ వాడివేపు నడిచింది తను.

''అమ్మో! ఆడపులొత్తొంది... నాగమల్లి కోనలోన...నక్కాలి లేడికూన...'' వెకిలిగా నవ్వుతూ, నవ్వు దాచుకోడానికి ప్రయత్నిస్తూ దుఃఖం మొహం మీద పులుముకుంటూ పాట ఆదుకున్నాడు కుర్రాడు... వాడి వెటకారపు ప్రవర్తన తనని క్షణంపాటు పశువుని చేసింది. ఒక్క అంగలో వాణ్ణి చేరుకుని, కూర్చున్నవాడిని జబ్బ దొరకబుచ్చుకుని లేవనెత్తింది.

'యూ... ఇడియట్...' కర్రచేతిని ఒక్క గుంజు గుంజింది. అది తన చేతిలోకి జారివచ్చింది. చొక్కా కాలరులోనించి రెండో చెయ్యి లోపలకి పోనిచ్చి వాడి అసలు చెయ్యి బయటకి లాగింది, ఊహించని ఈ పరిణామానికి ఖంగుతిన్నాడు కుర్రాడు. బిత్తరచూపులు చూస్తూ ఉండిపోయేడు.

''హౌ డేర్, యూ డెవిల్... ఇంతప్పట్నుంచీ

# గుడ్ బై

ఎంతెంత మోసాలు చేస్తున్నావ్.'' కోపంతో పెదాలు వణికిపోయేయి తనకి. ఆపుకోలేక చాచిపెట్టి ఒక్క చెంపదెబ్బ కొట్టింది.

''పైగా మమ్మల్ని వెక్కిరిస్తున్నావు కూడానా బ్లడీ రోగ్ ...'' మరో చెంప ఛెళ్ళుమంది. ''వళ్ళు వంచి పని చేసుకోలేవూ?...స్కౌండ్రల్...'' ఈసారి జుట్టుపట్టి గుంజి నెత్తిమీద రెండు మొట్టికాయలు మొట్టింది. ''ఇలా ఎంతకాలం సాగిద్దామనుకున్నావ్ ... రాస్కెల్. ఉండు నీ ఆట కట్టిస్తా – వెధవా ...''

తనేం చేస్తోందో తనకే తెలియని కోపంతో వాడి ముష్టిజోలి రోడ్డుమీదకి విసిరింది. అల్యూమినియం బొచ్చె నేలకేసి కొట్టింది. వాడి ఆనప కాయ తంబురా గాలిలోకి ఎగరేసింది ... వాడు గేదె లాగ అరుస్తూ ఏడుపు లంకించుకున్నాడు.

అప్పటికి ఏడు కూడా కాలేదు. రోడ్డుమీద జనసంచారం తక్కువగా ఉంది. ఉన్న వాళ్ళందరూ ఈ రభస చుట్టూ మూగిపోయేరు. పదమూడో నెంబరు బస్సొచ్చింది. అక్కడ దిగవలసినవాళ్ళంతా దిగేరు. ఎక్కడో దిగవలసిన వాళ్ళు కూడా దిగేరు. గొడవ తిలకించేరు. అట్టేసేపక్కర్లేకుండానే విషయం అందరికీ అర్థం అయిపోయింది. తలోమాట అన్నారు. కొందరు ఓపిక చేసుకుని బలిపశువులాగ నిలబడిన కుర్రాడి బుగ్గల్నో పొడిచేరు. బస్సు కదిలింది. తోచినంతసేపు తిట్టకలిగినన్ని తిట్లు తిట్టి ఎవరి దారిని వాళ్ళు వెళ్ళిపోయేరు.

తను మాత్రం శక్తి కోల్పోయి నిలబడింది. సమయానికి దేవుడిలాగా కొలీగ్ మోహనరావు రాబట్టి సరిపోయింది.

''లేటయిపోతోంది, పదండి భారతిగారూ! పోదాం. ఇలాటివాళ్ళని కాలమే సరిచేస్తుంది. మనమేం చెయ్యలేం...'' మారు మాటాడకుండా తనతన్ని అనుసరించింది.

ఆ రోజు తనేం చెయ్యలేకపోయింది. వర్కంతా పెండింగులో పెట్టింది. తెచ్చుకున్న టిఫిన్ బాక్స్ అలాగే ఉంచేసింది. కాఫీ తాగలేదు. కొలీగ్సు ఎంత బతిమాలినా లంచ్ బ్రేక్‌లో ద్వారకాకి వెళ్ళలేదు. తను చేసిందేమీ తప్పు కాదనిపించినా ''కుర్రవెధవమీద అనవసరంగా చెయ్యి చేసుకున్ననేమో'' అని బాధ పడింది.

''పాపం వాడిది మాత్రం తప్పేముందని? హాయిగా ఆడుకుంటూ పాడుకుంటూ బడికి వెళ్ళే వయసులో వాడిలాగ ప్రజల్ని మోసం చెయ్యడానికి పూనుకున్నాడంటే... వాణ్ణలా చేసిన సంఘాన్ని కూడా అనాలి...''

పిచ్చి పిచ్చి ఆలోచనల్తో పగలంతా గడిపేసి సాయంత్రం ఇంటి ముఖం పట్టింది. బస్‌స్టాపులో నిలబడి వద్దనుకుంటూనే వాడు కూర్చునే స్థలంకేసి చూసింది. అక్కడంతా కాళీగా వుంది.

''బిచాణా ఎత్తేసి పోయేడేమో దొంగవెధవ... లేకపోతే వాడి ఆటలు సాగుతాయా ఇహ!...'' చిన్న విజయగర్వం అనుభవించింది తను.

''మళ్ళీ ఏ ఆఫీసు ముందు పెట్టేడో దుకాణం? ఇంకా ఎంతకాలం ఎంతమందిని మోసం చేస్తాడో?...'' దూరాన్నించి పరుగెట్టవస్తున్న బస్సు నెంబరు చూడటానికి మెడ చాచింది. బిత్తరి చూపులు చూస్తూ వాడక్కడే నిలబడి ఉన్నాడు. కర్రచెయ్యి లేదు. మామూలుగా రెండు చేతులు కనపడేటట్లు చొక్కా తొడుక్కున్నాడు. గుబురు జుట్టు నున్నగా దువ్వేడు. మాసికలు వేసినవే అయినా శుభ్రంగ ఉన్న నిక్కరు, చొక్కా తొడుగుకున్నాడు. కళ్ళు ఉబ్బిన్నాయి. దెబ్బలు బాగా తగిలి ఉంటాయి. బుగ్గలు ఎర్రగావాచి పోయేయి. 'పాపం ... వెర్రినాగమ్మగాడు ...' చటుక్కున నాలుక కరుచుకుంది తను.

'అర్హతలేనివారి పట్ల ఆప్యాయత చూపించ కూడదు' మొహం సీరియస్‌గా పెట్టుకుని బస్సురాగానే ఎక్కేసింది. బస్సు ఖాళీగావుంది. కిటికీ దగ్గర సీటులో కూర్చుంది. ప్రొద్దుటి సంఘటన మనసులో నించి తుడిచేసే ప్రయత్నం చేస్తూ షాపులకున్న సైనుబోర్డులు చదివింది. ప్రతి స్టేజీలోను క్లీనరు కుర్రాడు గీ పెడుతున్నాడు.

''ఎల్లమ్మతోట ... జైలురోడ్డు ... దొండపర్తి ... మ్యాకోలనీ ...''

యాంత్రికంగా లేచి బస్సు దిగింది తను.

''అమ్మయ్య! ఇంటికొచ్చి పడ్డాను'' చీర సవరించుకుని తనుండే వీధివేపు తిరిగింది. నుగవాళ్ళ గేటులోనించి దిగుతూ కనిపించేడు వాడు. విస్తుపోయింది తను.

''వెధవ నన్ను వెంబడిస్తున్నాడే ...'' గబగబ నందు మలుపు తిరిగింది. పెద్ద పెద్ద అంగలు వేసింది. ఏమేమో ఆలోచించింది.

''కొంపదీసి నా మీద పగబట్టి రావటంలేదు కదా ...'' వళ్ళు గగుర్పొడిచింది తనకి. ''వేలెడంత వెధవ నన్నేం చేస్తాడు!'' ధైర్యం తెచ్చుకుంది.

''ఊరికెనే అనుమానపడుతున్నానేమో! వాడి తాలూకు వాళ్ళెవరయినా ఇక్కడ ఉంటే వచ్చి ఉంటాడు. లేదా వాడి 'కుంటి నాటకం' ఇక్కడ మొదలెడదామని వచ్చేడో...'' వెనక్కి తిరిగి చూసింది. బిక్కమొహంతో తన వెనకే వస్తున్నాడు వాడు.

''ఓర్నాయనోయ్! వీడు నామీద పగపట్టేడు'' నడక స్పీడు హెచ్చించింది. ఇల్లు దగ్గర పడినకొద్దీ భయంకరమయిన ఆలోచనలు రాసాగేయి తనకి.

''వీడేదో దొంగల ముఠాకి చెందిన ఏజెంటయ్యుంటాడు. నా ఆచూకీ, ఆనూపానూ తెలుసుకుని వాళ్ళకి చేరవేస్తాడు. వాళ్ళ పని నడుస్తుంది. వీడి పగ కూడా చల్లారుతుంది...''

కంపించిపోతున్న చేతులతో తాళం తీసింది. ''రాజన్నయ్యని ఈ రాత్రికక్కడ పడుకోమని ఫోన్ చేసి చెప్పాలి...'' బెదురుతూ గడప దాటబోతున్న తన కాళ్ళు ఎవరో పట్టుకుని లాగినట్లయింది. వెనుతిరిగి చూసింది.

వెక్కి వెక్కి ఏడుస్తూ కాళ్ళమీద బోర్లాపడి ఉన్నాడు కుర్రకుంక. ఆశ్చర్యపోయింది కాని బింకంగా నిలబడింది. కొన్ని క్షణాలు గడిచేయి.

''బుడి బుడి దీర్ఘాలు తీస్తున్నాడు దొంగ చచ్చినోడు'' అనుకుంది.

''చాల్లే నాటకం'' కోపంగా కాళ్ళు వెనక్కి లాగేసుకోబోయింది. పట్టు వదల్లేదు వాడు.

కన్నీటితో సరికొత్త చెప్పులు తడిపేస్తున్నాడు. "నాటకం కాదేమో! నిజంగా పశ్చాత్తాప పడుతున్నాడేమో?" తన మనసు ఆట్టేసేపు గట్టిగా ఉండదని తనకి బాగా తెలుసు. కొద్ది కొద్దిగా కరిగిపోతోంది!

"నన్ను పెమించక్కయ్యా! నాన్తప్పజేసిన్ను. మరేటి సెయమంతవు! కడుపాకలి...తల్లిదండ్రుల్లేరు" ఏడుస్తూ చెప్పేడు కుర్రకుంక.

"పన్జేసుకుని బతకమంతన్నవే! నాకెవరిస్తరేటి పని. కాల్లు సేతులు గట్టి సుంతె ముష్టివసేస్తరూ! నన్ను పెమించక్కా! నాకు నీ పంచలో కుసెంత చోటివ్వవూ! నా చేత నడుమిరిగేలా పనుల్జేయించుకో! నీ ఎంగిలి మెతుకులు నాకొడెయ్యి. నా కమ్మనేదు, నాన్ననేడు. పెంచిన ముసల్ది సచ్చిపోనాది. నీ గుమ్మంలో కుక్కనాగ కాపలాకాస్తాను."

ఎక్కిళ్లొస్తున్నా లెక్కచెయ్యకుండా చెప్పదల్చుకున్నదంతా చెప్పుకుపోతున్నాడు. తన జాలి గుండె కరిగి కట్టలు తెంచుకొని కన్నీటి రూపంలో ప్రవహించింది.

కుర్రాణ్ణి జబ్బ పట్టుకుని లేవనెత్తింది.

"చిన్నప్పుడు తీర్థంలో తప్పిపోయి మళ్లీయాల తిరిగొచ్చిన నీ చిన్న తమ్ముణ్నే అనుకో అక్కా ..." కన్నీళ్లు చొక్కాతో తుడుచుకుని రెండు చేతులు ఎత్తి దణ్ణం పెట్టేడు.

"ఛ! వెధవా! సినిమా డైలాగులు కూడా నేర్చేవు. నా తమ్ముళ్లెవరూ తప్పిపోలేదు. నువ్విక్కడే ఉందువు కాని ... లే ..."

తనా మాట అందో లేదో ... బంగారంతో లక్క అతుక్కుపోయినట్లు అతుక్కుపోయేడు వాడు తనతో. మొదటి రోజుల్లో నర్సిగాణ్ణి యెడంగా చూసేది తను. వేళకి తిండి పెట్టేది. కాని ప్రొద్దుట వండినది రాత్రి, రాత్రి వండిన మళ్లీ మర్నాడు ప్రొద్దుట ... భోజనం చెయ్యడానికి — పింగాణీ పళ్లెం ... మంచినీళ్లు తాగడానికి సత్తు గ్లాసు కొంది. చిరిగిపోయిన దుప్పట్లు — పాత బొంతలతో వాడికి పక్క ఏర్పాటు చేసింది. కటకటాలలోనే వాడి నివాసం. ఆ పని ఈ పని అని లేకుండా అంట్లుతోమడం, నీళ్లు తోడటం, బట్టలుతకడం, బజారెల్లి వెచ్చాలు తేవడం ... రకరకాల పనులు చెప్పేది. సూటిపోటి మాటలతో వాణ్ణి సవాలక్ష పరీక్షలకి గురిచేసింది. 'బెదిరి పారిపోతాడేమో! పీడవిరగడవుతుంది' అనుకుంది. వాడు కదల్లేదు. సరికదా — ఏడాది దాటిపోతున్నా ఎవరూ వాడికోసం రాకపోవడంతో 'నర్సిగాడికి నిజంగా దిక్కులేదు' అని గ్రహించింది.

వాడు మునుపు ఉండేచోటు — జారారుపేట. ఆ ప్రాంతం ముష్టివాళ్లందరిని అడిగింది నర్సిగాడి గురించి. నర్సిగాడు దేవుడమ్మ పెంచిన దిక్కులేని కుర్రాడని వాళ్లు చెప్పేరు. మూడేళ్ల గుంటడిగా బోడిగుండుతో సింహాచలం కొండమీద ఏడుస్తూ తిరుగుతున్న నర్సిగాణ్ణి దేవుడమ్మ చేరదీసింది. 'మీవోడా' అని ఎందర్నో అడిగింది. ఎవరూ మావాడనలేదు వాణ్ణి. తనకి తప్పదని వాణ్ణి పెంచి పెద్ద చేసింది. వాడికి పదేళ్లు నిండేసరికి దేవుడమ్మకి వయసయిపోయింది. మంచాన పడింది. రెండేళ్లపాటు అలాగే మంచంలో ఉంది. చచ్చిపోయేముందు కన్నీళ్లు కారుస్తూ "నాయలు కన్నకొడుకివో... నా పెంబడినావు. నీకేటి యాస్తిపాస్తులియ్యనేకపోయినా బతటానికి నీకో దోవ చూపిస్తాను. ఈ లోకం మా చెడ్డది. కళ్లు కాళ్లు సరింగా ఉన్నోళ్లకి ముష్టి కూడా యెట్టరు. సూరప్పదుగోడ్నడిగి ఆడి మనవడు తీసేసిన కర్రచెయ్యి తెచ్చుకుని జబ్బకి తగిలించుకో! అదే నీకు కూడెట్టేస్తాది" అంటూ కళ్లు మూసింది.

మునిసిపాలిటీ పనివాళ్లు దేవుడమ్మ శవం 'చావుల మదుం'లో పూడ్చేసేక నర్సిగాడు వృత్తిలోకి దిగిపోయేడు.

అంతా విని "పాపం" అనుకుంది తను. కాని ఏ పుట్టలో ఏ పాముందో! నమ్మకంగా ఉన్నట్లే ఉండి, వీలుచిక్కగానే ఇంట్లో ఉన్న చెంబు, తప్పేలా... వెండి బంగారం చేజిక్కించుకుని పారిపోతే... రెండు సంవత్సరాలు గడిచేకగాని నర్సిగాడిమీద నమ్మకం ఏర్పడలేదు తనకి.

"తంతే గారెలబుట్టలో పడ్డట్టు చేరేడు వెధవ నా యింట్లో" అనుకుంది చాలాసార్లు.

కాని ఎంతకాలం ఇతరులమీద ఆధారపడి బ్రతుకుతాడు! వాడికేదో శాశ్వితమయిన భృతి చూపించాలి. ప్రయత్నించింది. పరిచయమున్న మందుల షాపుల్లో 'సేల్సు బాయ్'గా వేసుకోమని అడిగి చూసింది. డైరెక్టుగా కాదనకపోయినా "మెట్రిక్ వరకయినా చదివినవాడయితే అలాగే చూద్దాం" అన్నారు వాళ్లు.

"ఇంత చేసినదాన్ని వీడికి నాలుగు ముక్కలు చదువు చెప్పలేనా!..." తన విశ్వాసం నమ్మకాలేదు. దేవుడమ్మ పెంపకంలో ఉండగా, వీధి బడికెళ్లి నాలుగునాకా చదివిన నర్సిగాడికి ఇంగ్లీషు, లెక్కలు, తియ్యనీటికి చేప ఎక్కినట్లు వచ్చేయి.

"వెర్రివెధవాయి చేత మెట్రిక్ పరీక్ష రాయిస్తే" అలా ఆలోచిస్తూండగానే తనకి గుంటూరు బదిలీ అయింది. వేరే ఆలోచన లేకుండా, నర్సిగాణ్ణి వెంటపెట్టుకుని గుంటూరు అరండల్ పేటలో మకాం పెట్టింది తను. దిగిన రోజే ఇల్లుగల పిన్నిగారు నర్సిగాణ్ణి చూపించి "మీ తమ్ముడా!" అని అడిగింది. తను 'వన్స్‌పరాల్' అవునని చెప్పి వాడి సొంత 'అక్క'గానే తనని అందరికీ పరిచయం చేసుకుంది.

మర్నాడు వాడిని మెట్రిక్ కోచింగ్‌కి జాయిన్ చేసింది. నర్సిగాడికి 'నరేంద్రబాబు' అని నామకరణం చేసింది. అప్లికేషన్ ఫారంలో తండ్రి పేరు రాయాల్సినచోట నిస్సంకోచంగా తన తండ్రి పేరు రాసి వాడికి మంచి జన్మనిచ్చింది.

నరేంద్ర ఫస్టుక్లాసులో మెట్రిక్ పాసయ్యేడు. కృతజ్ఞత పట్టుకోలేక భారతక్కయ్య పాదాలు కన్నీటితో తడిపేసేడు.

ఆ తర్వాత తనకి వరంగల్ 'ఎమ్. జీ. యెమ్.' దవాఖానాకి ట్రాన్సఫరయింది. నరేంద్రబాబు ఇంటరు కూడా ఫస్టుక్లాసులోనే పాసయ్యేడు. డిగ్రీలో చేర్పుదామనుకుంటుండగా, తనకి చాలా జబ్బు చేసింది. టైఫాయిడ్, నలభయిరోజుల కాయిలా! క్షణం తన మంచం వదలకుండా, పగలు రాత్రి సంతత ధారాపాతంగా ఏడుస్తూ సేవలు చేసిన నరేంద్రని చూసి "నువ్వే నాకు నిజమయిన తమ్ముడివిరా ... నాతో రక్తం పంచుకుని పుట్టకపోయినా నీ రక్తం నాకు ధారపోస్తున్నావు" కళ్లనీళ్లు పెట్టుకుంది.

ఎలాగో జబ్బు తగ్గింది. కాని నరేంద్ర భవిష్యత్తును గురించి చింత ఎక్కువయిపోయింది తనకి. జబ్బుతో గొప్ప నరాల బలహీనత పట్టుకుంది. అస్తమానం చచ్చిపోతానన్న ఆలోచనే! నలభయినాలుగేళ్లకే అందరూ చచ్చిపోతారా? అయినా






# గుడ్ బై

శరీరం శాశ్వతం కాదు కదా! హఠాత్తుగా తను 'హరీ' అంటే నరేంద్ర గతేం కాను! చదువుపూర్తి కాలేదు. ఉద్యోగమూ లేదు. ఎటూ కాకుండా అయిపోయి మళ్లీ పాత స్థితికే దిగజారిపోతాడేమో ...

తన పలుకుబడి ఉపయోగించి కొత్తగా పెట్టిన ఒక ప్రైవేటు కాలేజీలో 'లేబరేటరీ అటెండరు' ఉద్యోగం వేయించింది. నరేంద్ర నైట్ కాలేజీలో చేరి డిగ్రీ పూర్తి చేసేడు. పైపు పరీక్షలు పాసయ్యేడు. కాలేజి సెక్రటరీగారి ప్రాపకం సంపాదించి అతి త్వరలోనే 'ఎల్డీసీ'గా ప్రమోషన్ అందుకున్నాడు.

ఇంతలో మామూలు గొడవలే ... ప్రైవేటు కాలేజీ స్టాఫ్‌తో మానేజిమెంటు 'క్లాష్ ... '

ప్రత్యయికులు .. ధర్నాలు...నిరాహారదీక్షలు... చివరికి కాలేజీ గవర్నమెంటు తీసుకుంటోందన్న జి. వో. పుట్టింది. ఆర్నెలు కాకుండా, అమలు పర్చబడింది.

"ఫర్వాలేదు బాగానే సెటిలయిపోయేడు జీవితంలో ... " నిశ్చింతగా ఊపిరి తీసుకుందామనుకుంటోంది తను. ఇదిగో ... పిడుగుపాటల్లే ... ఈ ఉత్తరం.

* * *

గతంలోనించి వర్తమానంలో ప్రవేశించిది మళ్లీ భారతి మనసు.

'చదువు చెప్పించినందుగ్గాను వీడ్కోలు లేఖ రాసేడు.'' నవ్వుదామనుకున్న భారతి కళ్ళు చెమ్మగిల్లేయి -

"నా దారి నే చూసుకుంటాను. నీ ఖర్మ నువ్వనుభవించు'' అని బాహాటంగా చెప్పేస్తే తనేం అడ్డుకోదుగా! మళ్లీ దానికో లేఖ వ్రాయలా! దర్జాగా వెళ్లిపోవచ్చు. ఎక్కడికయినాసరే! ఎంతమంది అలా నడిచిపోలేదు తన బ్రతుకులోనించి !!

గమ్యం తెలియని సీలింగ్ ఫ్యానుని చూస్తూ వర్తమానం గతంతో ముడిపెట్టే ఆలోచన చేసింది భారతి.

స్వతంత్రం రావడానికి దశాబ్దం ముందు పుట్టింది తను. తన తండ్రి దేశభక్తికి మొదటి మచ్చు తునక. స్వతంత్ర పోరాటంలో నాన్నగారికి పదవులేవీ మిగలకపోయినా ఆయనకి చివరి దశలో తీవ్రమయిన క్షయ వ్యాధి మాత్రం అంకురించింది. ఆస్తిపాస్తులు కరిగిపోయేయి.

ఒక బియ్యేస్సీ డిగ్రీ... గవర్నమెంటు మెడికల్ సర్వీసెస్‌లో రక్త పరీక్షా విభాగానికి చెందిన ఒక చిన్న ఉద్యోగం... అనాథ తల్లి, ఇద్దరు చిన్న తమ్ముళ్లనీ తనకి అప్పగించి... నాన్నగారు ఇహ లీలా సమాప్తి చేసుకుని వెళ్లిపోయేరు. తను తమ్ముళ్లని చదివించింది. తన చెయ్యి మంచిది. ఖర్చు పెట్టిన డబ్బుకి బాగా ఫలితం దక్కింది తమ్ముళ్ల 'ఎకడమిక్ కెరీర్' అద్భుతం. ఇద్దరూ అమెరికా వెళ్లిపోయేరు! వెళ్లకేం చేస్తారు మరి! వాళ్ల చదువు, తెలివితేటలకి తగ్గ ఉద్యోగాలు మన దేశంలో ఎక్కడున్నాయి? తర్వాత ఇద్దరివీ "వెడ్డింగ్ కార్డ్సు'' అందేయి తనకి.

ఇక అమ్మ! తనని చేసుకుంటానని ముందుకి వచ్చిన ఒకరిద్దరు పెళ్లికొడుకులకి వంకలు పెట్టి చెడగొట్టింది. తను పెళ్లి చేసుకుంటే అమ్మకి "పట్టుకొమ్మ జారిపోతుంద''ని భయం. చేతులు కాలేక ఆకులు పట్టుకున్నట్లు ఆఖరి క్షణాల్లో "నిన్ను ఒంటరిదాన్ని చేసి వెళ్లిపోతున్నానే...'' అని యేడ్చింది.

వెడితే వెళ్లిందిలే! తనేం బ్రతకలేదా! అంతమంది సొంతవాళ్లు వెళ్లిపోతేనే తను లక్ష్యపెట్టలేదు... 'అఫ్టాల్' వీడెంత!... పైగా ఒక ఉత్తరం ఒకటి... కథ రాసినట్లు రాసేడు...

గతమంతా తవ్వుకుని అవ్యక్తమయిన వేదన అనుభవించింది భారతి. అశాంతిగా అటూ యిటూ మంచంమీద దొర్లింది. వంటింట్లో నమ్మక్క వంట చేస్తున్న చప్పుళ్లు వినిపిస్తూనే ఉన్నాయి

ఏదో గుర్తొచ్చినదానిలాగ మంచం దిగింది. హేండ్ బాగ్ తెరిచింది. ఉత్తరం చేతిలోకి తీసుకుని ట్యూబ్ లైటు ఆన్ చేసింది. వణికే చేతులతో ఉత్తరం విప్పి పంక్తుల వెంట దృక్కులు పోనిచ్చింది

"అక్కా!

నువ్వు హిమాలయోత్తుంగ శృంగానివి. నన్ను మురికిలోనించి లేవనెత్తేవు. మైలపడిన నా బ్రతుకు పవిత్రం చేసి నాకొక నేమ్ అండ్ అయిడెంటిటీ నిచ్చేవు నా చర్మంతో చెప్పులు కుట్టించి నీ కాళ్లకి తొడిగినా నీ ఋణం తీరదు.

నువ్వనేదానవు—మన తాతముత్తాతలు, అవ్వ ముత్తవ్వల శారీరక లక్షణాలతోపాటు వారి వారి మానసిక ప్రవృత్తి కూడా 'జీన్సు' ద్వారా మనకి సంక్రమిస్తాయని. నా తాత తండ్రులెవరో నాకు తెలియదు. నువ్వే నా తల్లి, నా తండ్రి, నా గురువు—నా దైవము, నీ లక్షణాలే నా 'జీన్సు'లో ఉన్నాయి

నేను కూడా ఒక మురికి మనిషిని లేవనెత్తేను సత్తి నాచిన్నప్పటి స్నేహితురాలు. దేవుడునాన్నమ్మతో పాటు ఆడుక్కునే తంబురా వీరిన్న కూతురు మేం కలిసి మెలిసి ఆడుకునేవాళ్లం మొగుడు పెళ్లాలాట! నేను మొగుడు .. అది పెళ్లం. నేను బిచ్చమడిగి సరుకులు తేవటం ... అది వండటం .. నేను వంట బాగాలేదని దాన్ని కొట్టడం ... అది ఏడ్వటం ...

పదిరోజుల క్రిందట, పొట్టకూటి కోసం వ్యభిచారం చేసే ప్రేమ్‌మెంటు వ్యభిచారిణిగా నా సత్తి నాకు తటస్థపడింది.

బాగా ఆలోచించేను. దానిని స్వీకరిస్తే నువ్వు నా కిచ్చిన సంస్కారం నిల్పుకున్నవాడినౌతానని తోచింది నాకు. నీకు చెప్పకుండా సత్తిని పెళ్లాడేసేను. నర్సిగాడు నరేంద్రబాబయినట్లే సత్తి 'సత్యభామ' అయింది.

సీక్రెట్‌గా ట్రాన్స్‌ఫర్ ఏర్పాట్లు చేసుకున్నాను ఈ రోజు నా భార్యను తీసుకుని నా బ్రతుకు బాట పట్టిపోతున్నాను.

అక్కా! ఈ విశ్వాసం గల కుక్క నిన్ను వెదుక్కుంటూ మళ్లీ నీ దగ్గరికే వస్తుందిసుమీ!

సత్తి, నీ ప్రక్కన నిలబడేపాటి - అర్హత సంపాదించుకున్నాక ఇద్దరం నీ దగ్గరకే వస్తాం! నువు నన్ను తీర్చిదిద్దినట్లుగానే, నేను సత్తిని ఓ మనిషిగా మార్చి నీ వద్దకి తెస్తాను. నేను వెళ్లిపోతున్నానని బాధపడకు. నిన్ను ఒంటరిగా వదలను.

నువ్వు నీ తమ్ముడు నరేంద్రుడు, నీ మరదలు సత్యభామ, నీ మేనల్లుడు, నీ మేనకోడలు [వాళ్ల పేర్లు నీ చాయిస్ ప్రకారం]తో హాయిగా గడిపే రోజొస్తుంది.

అందాకా గుడ్‌బై... అహహ... షెల్ బీర్... కాదు. మళ్లీ వస్తానక్కా!

నీ

నరేంద్ర''

"పిచ్చిమొహం! ఒక్క ముక్క నాతో అంటే నేనే వైభవంగా నీ పెళ్లి జరిపించేదాన్నిగా! వెర్రినాన్న...''కొంగుతో కళ్లొత్తుకుంది భారతి.

"నమ్మక్కా! ఎదురింటి పిన్నిగార్నడిగి ఒక ఇన్లాండు కవరు అప్పు తేవే! నరేంద్రని భార్యతో వెంటనే ఇంటికి రమ్మని రాయాలి...'' కళ్లజోడు తీసి తుడిచి మళ్లీ పెట్టుకుని, పెన్ను వెతుక్కుంటూ దృఢనిశ్చయం ధ్వనించే గొంతుతో అంది భారతి.

ఫిబ్రవరి 10వ తేదీన గుణదల మేరిమాత మహోత్సవంలో గాస్పెల్ మెసెంజర్స్ [విజయవాడ]వారు ప్రదర్శించిన 'బైబిల్' నృత్య రూపకంలో క్రీస్తుని ఊరేగింపుగా జరూసలెం నగరానికి తీసుకు వెళ్తున్న దృశ్యం

